క్లుప్తంగా

● రక్షాబంధన్


కలెక్టర్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి

చిత్తూరు కలెక్టరేట్: రాఖీపౌర్ణమి పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డ్వామా పీడీ రాజశేఖర్ లకు బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టారు. అనంతరం కరపత్రాలను ఉన్నతాధికారులకు అందజేశారు. కార్యక్రమంలో చిత్తూరులోని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విద్యాలయ సభ్యులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న వైఎస్‌ఆర్ సీపీ నాయకులు, జెడ్పీటీసీ

పూతలపట్టు: మండలంలో రైతులు ఎదుర్కొంటున్నా రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని జెడ్పీటీసీ దేవిక, వైఎస్‌ఆర్ సీపీ నాయకులు తహసీల్దార్ గుర్రప్పను కోరారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ దేవిక మాట్లాడుతూ మండలంలో భూమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ ధనలక్ష్మిని కలసి మండల అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అధికారులను దుశ్శాలువాలతో సన్మానించారు. వీరితో పాటు తలపుల బాబురెడ్డి, సచివాలయం కన్వీనర్ సుధాకర్, వెంకటరమణ, ఉమాపతి పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదుపై విచారణ


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేషన్ అధికారులు

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై విచారణ చేసి సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ సహాయ కమిషనర్ రామకృష్ణుడు ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇంజనీరింగ్, టిడ్కో, పట్టణ ప్రణాళిక విభాగాలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేసి పరిష్కరించాలన్నారు. ప్రజారోగ్యశాఖ అధికారి అనిల్‌కుమార్ నాయక్, మేనేజర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

'పరిహారం రైతుల ఖాతాలో జమ చేయండి'

గుడుపల్లె: రైల్వే లైన్లకు భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పెండింగ్‌లో ఉన్న పరిహారం సొమ్మును వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ఆర్డీఓ శ్రీనివాసరాజు ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలతో ఆయన సమీక్షించారు. మారికుప్పం నుంచి కుప్పంకు వేసే రైల్వే లైన్లకు భూములు కోల్పోయిన కొంత మంది రైతులకు ఇంకా నిధులు జమ కాలేదన్నారు. వెంటనే రైల్వేకు సంబంధించిన భూముల వివరాలను తీసుకుని పరిశీలించి రైతుల ఖాతాలతో జమ చేయాలన్నారు. రైతులకు సంబంధించిన సర్వేలు, భూ సమస్యలను పరిష్కరించాలని, భూ సమస్యలేవీ పెండింగ్ ఉండరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీతారాం, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవం

పలమనేరు: పట్టణంలో ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని స్థానిక ఏటీఎం సర్కిల్ వద్ద స్థానిక ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సోమవారం నిర్వహించింది. కెమెరా సృష్టికర్త డాగురే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. నాటి మహనీయుల కృషి ఫలితంగానే తాము ఫొటోగ్రఫీతో ఉపాధి పొందుతున్నామని అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేష్ అన్నారు. కార్యక్రమంలో పలువురు ఫొటో, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.

ఎస్‌సీటీ శిక్షణ తనిఖీ చేసిన డీవైఈఓ


శిక్షణను పరిశీలిస్తున్న డీవైఈఓ చంద్రశేఖర్

పలమనేరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ కార్యక్రమాన్ని చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్ సోమవారం తనిఖీ చేశారు. ఈ శిక్షణ టీచర్ల వృత్తి నైపుణ్యాలను మెరుగు పరచుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం, ఏఎస్‌ఓ నారోత్తమరెడ్డి, హెచ్‌ఎంలు ఈశ్వర్ ప్రసాద్, షంషీర్, ఆర్‌పీలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ఢమాల్..!

ఆగస్టు నెలలో కూడా వేసవిని తలపిస్తూ ఎండలు మండుతున్నాయి. జిల్లాలో వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. రోజూ సగటున 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఈ నెలలో ఎండల మూలాన పెరిగిన వేడి దెబ్బకు విద్యుత్ వాడకం గణనీయంగా పెరిగింది. దీంతో గ్రామాల్లో ఎక్కువగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. విద్యుత్ సమస్యలతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.

- వేసవిని తలపిస్తున్న ఉష్ణోగ్రత
- పెరిగిన విద్యుత్ వాడకం
- లోడు భారం పెరిగి కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు
- వారం రోజుల్లో 234 మరమ్మతులు
- విద్యుత్ అంతరాయంతో అవస్థలు


ఎస్పీఎంలో మరమ్మతుకు వచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా వ్యాప్తంగా ఎండల తీవ్రతతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఎయిర్ కండీషన్లు, కూలర్లు, ఫ్యాన్లు, విద్యుత్ ఉపకరణాల వాడకం పెరగడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. ఫలితంగా ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ భారం పెరిగి కాలిపోతున్నాయి. మార్చిలో కంటే ప్రస్తుతం గ్రామాల్లో నివాసాలకు విద్యుత్ సరఫరా చేస్తున్న 15 కేవీ సామర్థ్యం గల సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కువగా కాలిపోతున్నాయి.

గత వారం రోజులుగా అన్ని రకాల ట్రాన్స్‌ఫార్మర్లు కలిపి ఉమ్మడి జిల్లాలో 234 కాలిపోగా.. అందులో గ్రామాల్లో నివాసాలకు వాడే సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు 40 వరకు ఉన్నాయి. అదే ఆగస్టు మొదటి వారంలో 170 వరకు దెబ్బతినగా వీటిలో సింగిల్ ఫేజ్‌వి లేకపోవడం గమనార్హం.

రోజూ 33 ట్రాన్స్‌ఫార్మర్లు ఔట్

గత వారం రోజులుగా ఉమ్మడి జిల్లాలో రోజుకు 33 ట్రాన్స్‌ఫార్మర్ల కంటే ఎక్కువగా కాలిపోతున్నాయి. ఇందులో దాదాపు 5కు పైగా సింగిల్‌ఫేజ్‌వి ఉన్నాయి. ఆగస్టు మొదటి వారంలో 24 వరకు రోజూ కాలిపోతున్నాయి. ఎక్కువగా గుడిపాల, ఐరాల, గంగవరం, బైరెడ్డిపల్లె, పీలేరు, రేణిగుంట, శ్రీకాళహస్తి, తిరుపతి రూరల్ మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి.

వారం రోజులుగా కాలిన ట్రాన్స్‌ఫార్మర్లు

తేది	కాలిన ట్రాన్స్‌ఫార్మర్లు
ఆగస్టు 12	48
13	36
14	42
15	28
16	39
17	41
మొత్తం	234

విద్యుత్ అంతరాయం

సాధారణంగా ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే ఆ రిపోర్టు ఉన్నతాధికారులకు చేరవేసి క్షేత్రస్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎస్పీఎం (ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రానికి) తరలిస్తారు. అక్కడి నుంచి మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను పెట్టేలోపు విద్యుత్ అంతరాయంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు.

సొంత ట్రాక్టర్‌లో రిపేరుకు తెచ్చాం



రైతుల సమస్యలంటే ట్రాన్స్‌కో సిబ్బంది ఇటుపక్క తొంగిచూడరు. ట్రాన్స్‌ఫార్మర్ రిపేరు అని ఫిర్యాదు చేసినా వాళ్ల చుట్టూ తిప్పించుకుంటారు. పొలాలు ఎండిపోతున్నా పట్టించుకోరు. మరమ్మతు కోసం ట్రాన్స్‌ఫార్మర్‌ను చిత్తూరుకు సొంత ట్రాక్టర్‌లో తీసుకెళ్లి వచ్చాం. విద్యుత్ సమస్యలతో తిప్పలు పడుతున్నాం. –అమర్‌నాథ్, రైతు యాదమరి

అంతరాయాలతో ఇక్కట్లు



మండలంలో కరెంటు కోతలు ఎక్కువగా ఉన్నాయి. కరెంటు ఎప్పుడు వస్తుందో..పోతుందో తెలియని పరిస్థితి. కోతల వల్ల మేమంతా ఇబ్బంది పడుతున్నాం. అంతరాయాలు లేని నాణ్యమైన కరెంటు ఇస్తామని హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం ఆ హామీని నెరవేర్చడం లేదు. –దొరస్వామిరెడ్డి, తవణంపల్లె

ఎక్కువ ట్రిప్ అవుతోంది



వ్యవసాయానికి మెరుగైన కరెంటు ఇవ్వడం లేదు. వచ్చే సమయంలో ట్రిప్పింగ్స్ ఎక్కువగా ఉంటున్నాయి. వారం రోజులుగా ఎండలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లే కాకుండా వీధుల్లోవి కూడా కాలిపోతున్నాయి. వాటిని సకాలంలో సిబ్బంది తీసుకెళ్లడం లేదు. ఎన్నోసార్లు సిబ్బందికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. –నరసింహులు, రైతు, గంగవరం

సకాలంలో మారుస్తున్నాం

వారం రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల సంఖ్య పెరిగింది. గతంలో సింగిల్‌ఫేజ్‌లు వచ్చేవి కావు. ప్రస్తుతం వాటి సంఖ్య పెరిగింది. నివాసాల్లో ఎక్కువగా విద్యుత్ ఉపకరణాల వాడకం పెరగడంతో ఆ భారం ట్రాన్స్‌ఫార్మర్ల పై పడుతోంది. సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లను బాగు చేసి పంపుతున్నాం. –ఆనంద్, డీఈ, ఎస్పీఎం

ఈకేవైసీ చేయించుకోండి

గుడిపాల: గుడిపాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఉన్న ప్రతి సొసైటీ సభ్యుడు ఈకేవైసీ చేయించుకోవాలని సీఈఓ పట్టాభి కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించే సహకార సంఘాల కంప్యూటరీకరణలో భాగంగా సంఘంలోని సొసైటీ సభ్యులు, రుణగ్రహీతలు ఈ కేవైసీ చేయించుకోవాలని, ఇందుకుగాను ఆధార్, పట్టాదారు పాస్‌బుక్ జెరాక్స్‌తో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఫోన్ నంబర్, నామినీ పేరు, వయస్సు మొదలైన వివరాలు కార్యాలయంలో వెంటనే సమర్పించాలన్నారు. ఈకేవైసీ చేసుకున్న వారికి మాత్రమే సంఘంలో సభ్యత్వం, ఓటుహక్కు పొందేందుకు అర్హులన్నారు. అలాగే రుణగ్రహీతలు ప్రభుత్వం కల్పించే వడ్డీ రాయితీలు, ప్రమాద బీమా పొందుతారన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని మిట్టూరు సెక్షన్ పరిధిలో మంగళవారం చెట్ల కొమ్మల తొలగింపు పనుల దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. గిరింపేట, ఆర్టీసీ–1 డిపో రోడ్డు, గంగనపల్లె, మిట్టూరు, ఆర్టీఓ కార్యాలయ ప్రాంతం, కొండమిట్ట, చుట్టుపక్కల ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని తెలియజేశారు.

అపుస్మా జిల్లా కార్యదర్శిగా అమరనాథరెడ్డి



బంగారుపాళెం: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌–ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) జిల్లా జనరల్ సెక్రటరీగా బంగారుపాళెంకు చెందిన అమరనాథరెడ్డి(విద్యార్థి హైస్కూల్ కరస్పాండెంట్) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. సోమవారం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్ల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ ప్రతాప్‌సుందర్‌రాయల్‌రెడ్డి

తవణంపల్లె: గ్రామాల అభివృద్ధికి పంచాయతీ అధికారులు, సర్పంచులు చిత్తశుద్ధితో పనిచేయాలని తవణంపల్లె ఎంపీపీ ప్రతాప్‌సుందర్‌రాయల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూజలు చేసి శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని వివరించారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు కీలకమన్నారు. రిసోర్స్ పర్సన్లు హరిప్రసాద్‌రెడ్డి, దుర్గాప్రసాద్ గ్రామ పంచాయతీ విధులు, అధికారాలు, పంచాయతీ చట్టాలపై అవగాహన, పారిశుధ్య నిర్వహణ, బృందావనాలు(ఎస్‌డబ్ల్యూపీసీ) నిర్వహణపై అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీల్లో ఎల్‌ఈడీ వీధి దీపాల నిర్వహణ ఇంధన పొదుపుపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో విగ్రహ ప్రతిష్ఠాపన


పెద్దిరెడ్డిని ఆశీర్వదిస్తున్న పండితులు, ప్రత్యేకాలంకారంలో ఆంజనేయస్వామి

సదుం: మండలంలోని జోగివారిపల్లె పంచాయతీ బత్తలవారిపల్లెలో నూతనంగా నిర్మించిన కార్యసిద్ధి అంజనేయస్వామి ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయంలో హనుమాన్యాసన హోమాలు, ధ్వజ ప్రాణప్రతిష్ఠ, హోమాలు, బలి పూర్ణాహుతి, బింబ దర్శనం, కన్యా దర్శనం, మహా మంగళ హారతి కార్యక్రమాలు జరిగాయి. విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. వేద పండితులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి శేష వస్త్రంతో ఆయనను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. విశేష అలంకారంలో ఉన్న స్వామి వారిని పెద్ద ఎత్తున గ్రామస్తులు, భక్తులు దర్శించుకున్నారు. ఆలయం వద్ద అన్నదానం చేశారు. సాయంత్రం భజన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, సర్పంచ్ అనితాకుమారి, తిమ్మారెడ్డి, ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

అర్ధగిరిలో శ్రావణ పౌర్ణమి వేడుకలు


సుదర్శన హోమం చేస్తున్న వేద పండితుడు


కాణిపాకం: స్వామివారికి పాలాభిషేకం

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో సోమవారం శ్రావణ పౌర్ణమి(రాఖీ పౌర్ణమి) వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకులు భక్తితో స్వామికి అభిషేకం చేయించారు. అనంతరం స్వామికి గంధం, సుగంధ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యం సమర్పించారు. పలు రాష్ట్రాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. భక్తులు అన్నదానానికి బియ్యం, కూరగాయలు, పప్పుధాన్యాలు అందజేసి తమ మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఆలయం మండపంలో అర్చకులు స్వామికి భక్తిప్రపత్తులతో శాస్త్రోక్తంగా సుదర్శన హోమం నిర్వహించారు. ముందుగా కలశ పూజ చేసి ఆరాధించారు. తర్వాత అర్చకులు వేద మంత్రాలు పఠనం చేసి హోమం నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. హోమంలో ఆలయ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి దంపతులు, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు. రాత్రి అర్చకులు ఉత్సవమూర్తికి అభిషేకం, అలంకరణ పూజలు నిర్వహించారు. స్వామి పల్లకిలో కొలువుదీరి ఊరేగింపుగా ప్రాకారోత్సవం నిర్వహించారు. పౌర్ణమి వేడుకలను తిలకించడానికి విచ్చేసిన భక్తుల కాలక్షేపం కోసం హరికథలు, భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కాణిపాకంలో పౌర్ణమి పూజలు

కాణిపాకం: స్వయంభు శ్రీకాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో సోమవారం ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించి, పూజలు చేశారు. శ్రావణమాసం పౌర్ణమి సందర్భంగా ప్రధాన ఆలయంలోని కల్యాణ వేదిక వద్ద సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవమూర్తులకు ఆలయ అర్చక, వేద పండితులు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ చేశారు. ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వ్రత పూజలు


వ్రతమాచరిస్తున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని మాధవనగర్ బ్రహ్మనందాశ్రమంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా శ్రీసత్యనారాయణ స్వామి వ్రత పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆశ్రమ నిర్వాహకుడు కేశవానందస్వామి ఆధ్వర్యంలో శ్రీసత్యనారాయణస్వామి మూలవిగ్రహానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయం ఆవరణలో స్వామివారి చిత్రపటాన్ని మండపంలో ఏర్పాటు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం కేశవానందస్వామి శ్రీసత్యనారాయణస్వామి వ్రత ఫలితం, పౌర్ణమి విశిష్టతను భక్తులకు వివరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆగని ఏనుగుల దాడులు


ఏనుగులు ధ్వంసం చేసిన వరి పంటను చూపుతున్న రైతు రాజప్ప

ఐరాల: అటవీప్రాంత సరిహద్దు గ్రామాల పొలాలపై ఏనుగులు పదే పదే దాడులు చేస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఆదివారం రాత్రి నాగంవాండ్లపల్లె ఫారెస్టు బీటు నుంచి వచ్చి ఏనుగులు బసివిరెడ్డిఇండ్లుకు చెందిన నరేంద్ర సాగు చేసిన వరి పంటను తొక్కి నాశనం చేసి, అరటి చెట్లను విరిచేశాయి. మరో రైతు భాస్కర్ వరి పంటను ధ్వంసం చేశాయి. నయనంపల్లెలో రాజప్ప, హరి వరి పంటలను తొక్కి నాశనం చేసి, జయచంద్రారెడ్డి కొబ్బరి చెట్లను కూల్చేశాయి. సుమారు రూ.70 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. ఏనుగుల వల్ల చేతికొచ్చిన పంటలను నష్టపోతున్నామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

మేతకు తోలిన ఆవులు మాయం!

● ఉన్నతాధికారులకు బాధితుల ఫిర్యాదు


కలెక్టరేట్ వద్ద న్యాయం చేయాలని కోరుతున్న బాధితులు

చిత్తూరు కలెక్టరేట్: మేతకు తోలిన ఆవులు మాయమయ్యాయని నగరానికి చెందిన బాధితులు తులసి కుమార్, ఇంద్రాణి, పద్మనాభం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ, నగరంలోని కొంగారెడ్డిపల్లె, సత్యనారాయణపురానికి చెందిన ఎనిమిది ఆవులు మేత కోసం తోలగా కనిపించడం లేదన్నారు. గాలించినా కూడా కనబడలేదని, ఎవరో వాటిని చోరీ ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆవులపై ఆధారపడి జీవిస్తున్న తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై విచారణ చేయాలని పశుసంవర్ధక శాఖ, పోలీసులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో కుమారి, వెంకటేశులు, మహేంద్రబాబు, మురళి, విజయ తదితరులు పాల్గొన్నారు.

పానాటూరులో 104 వైద్యసేవలు


పానాటూరులో రోగులను పరీక్షిస్తున్న రష్మిత

గుడిపాల: మండలంలోని పానాటూరులో సోమవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. బొమ్మసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి రష్మిత రోగులు, గర్భవతులకు బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. గ్రామంలో మంచం పట్టిన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వారి ఆరోగ్యం ఎలా ఉందో పరీక్షించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ప్రియాంక, శివగామి, మణిమేఘల, భారతి పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: గర్భవతులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి మోహన్ వేలు కోరారు. సోమవారం మండలంలోని మత్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 45 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దోమకాటుకు గురి కాకుండా దోమ తెరలు వాడాలని. వేపాకు పొగ వేయాలని సూచించారు. గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

జెలిటిన్ స్టిక్స్ స్వాధీనం: ఇద్దరి అరెస్ట్


నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో జెలిటిన్ స్టిక్స్ కలిగిఉన్న ఇద్దరు నిందితులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. టూటౌన్ స్టేషన్‌లో సీఐ నెట్టికంతయ్య వివరాలను మీడియాకు వివరాలు వెల్లడించారు. తమిళనాడులోని తిరుపత్తూరుకు చెందిన ఎం.గోవిందరాజులు (49), ఎం.రమేష్ (48) తేనబండ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా పేలుడు పదార్థాలు కలిగివున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడులు చేసి, ఆ ప్రాంతంలో తనిఖీలు చేశారు. తమిళనాడుకు చెందిన అన్నదమ్ములు క్వారీ పనుల కోసం 76 జెలిటిన్ స్టిక్స్ తీసుకొచ్చినట్లు పోలీసులు గుర్తించారు. వీటికి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో నిందితులను అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు.

కొవ్వొత్తులతో నిరసన


గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులు పెడుతూ..


చిత్తూరులో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు, మహిళలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): కోల్‌కతా మహిళా వైద్యురాలి హత్య ఘటనపై చిత్తూరు నగరం గాంధీ విగ్రహం వద్ద సోమవారం రాత్రి జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. వేదిక సభ్యులతోపాటు విద్యార్థులు, మహిళా సంఘాలు కలిసి కొవ్వొత్తులతో కొంత దూరం ర్యాలీగా వెళ్లి...గాంధీ విగ్రహం వద్ద న్యాయం కోరుతూ కొవ్వొత్తులు వెలిగించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ డ్యూటీలో ఉన్న వైద్యురాలిని హత్య చేయడం దారుణమన్నారు. అతిక్రూరంగా వ్యవహరించిన ఆ రాక్షసులను శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లైంగికదాడి, హత్యకు పాల్పడిన నిందితులను ఉరి తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అరుణశివప్రసాద్, సుధాకర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.